క్లుప్తంగా

సకాలంలో పిల్లలకు టీకాలు వేయించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: పిల్లలకు టీకాలు సకాలంలో వేయించాలని స్థానిక పీహెచ్‌సీ అధికారి సంధ్య అన్నారు. మంగళవారం ఆశావర్కర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విటమిన్ ఏ సిరప్‌ను పిల్లలకు తొమ్మిదవ నెలలో మొదటి సారిగా ఇవ్వాలన్నారు. అలాగే ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి 5 ఏళ్ల వయసు వచ్చే వరకు ఇస్తూ ఉండాలన్నారు. గర్భిణులుగా ఉన్నవారిని 12 వారాల్లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి వారం గ్రామాల్లో వేస్తున్న టీకాల గురించి వారికి వివరించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లేటప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

నానో యూరియాతో మంచి ఫలితాలు



యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రైతుల పంటల్లో సంప్రదాయ గుళికల యూరియాకు బదులు నానో యూరియా వాడకం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని ఏఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని 35 యర్లంపల్లెలో స్థానిక రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నానో యూరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మామూలు యూరియా, డీఏపీతో పోలిస్తే ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా, డీఏపీ వాడకం వల్ల పంటల్లో మంచి ఫలితాలు వచ్చినట్లు పరిశోధనలు రుజువు చేశాయన్నారు. రైతులకు ఖర్చు కూడా వాటి కన్నా కాస్త తక్కువగా ఉంటుందని తెలిపారు. కలుపుమందుతో కలిపి నానో యూరియా పిచికారీ చేయవద్దని సూచించారు. నేలను కాపాడుకుంటేనే అన్ని రకాల పంటలు సాగు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు



గుడిపాల: ఆర్‌ఎంపీ క్లినిక్‌లో తనిఖీలు చేపడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: మండలంలోని ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై మంగళవారం గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు గుడిపాల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న ఆర్‌ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మందులు, మాత్రలు విక్రయిస్తున్నట్లు ఆమె గుర్తించారు. ఐవీలో ఉన్న మందులు, యాంటిబయాటిక్స్ మాత్రలను ఇవ్వకూడదని ఆదేశించారు. ఎక్కడా గానీ ఆర్‌ఎంపీలకు ఉన్న పరిధిని దాటకూడదని హెచ్చరించారు. రోగులు వచ్చి వారి సమస్యను వివరిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గాని, చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి గానీ తరలించాలని సూచించారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు



ఉద్యోగ మేళాలో పాల్గొన్న వివిధ ప్రాంతాల నిరుద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : నిరుద్యోగులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ మేళాను ఆయన ప్రారంభించారు. ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ మేళాలు వరం లాంటివన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. త్వరలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. పలు కంపెనీల్లో ఉద్యోగాలకు 162 మంది ఎంపికైనట్లు వారు వెల్లడించారు. వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్ధగిరి క్షేత్రం పాలక మండలి నియామకానికి నోటిఫికేషన్

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం పాలక మండలి నియామకానికి మంగళవారం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అర్ధగిరి క్షేత్రం పాలక మండలి పదవీకాలం 2024 జూలై 21వ తేదీ నాటికి ముగిసింది. ప్రస్తుత ప్రభుత్వం పాలక మండలి నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. 20 రోజుల్లో ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సంక్షేమ ప్రదాత వైఎస్సార్





వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విజయానందరెడ్డి, బంగారుపాళెం: కరిడివారిపల్లెలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సునీల్‌కుమార్

- మహానేత పాలన సువర్ణయుగం
- వైఎస్సార్‌కు నివాళి
- చిత్తూరు, పూతలపట్టులో భారీగా సేవా కార్యక్రమాలు

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయాన్ని పండుగలా మార్చిన మహనీయుడు మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దివి కేగి నేటికి 16 ఏళ్లు పూర్తయింది. కరువునేలను సస్యశ్యామలం చేసిన నిత్య కృషీవలుడు మనకు భౌతికంగా దూరమైనా.. ఇప్పటికీ జనం గుండెల్లో కొలువయ్యే ఉన్నారు. ప్రజల ముంగిటకే పాలన అంటూ రచ్చబండ కోసం చిత్తూరుకు వస్తూ నిష్క్రమించిన రోజును జిల్లా వాసులు గుర్తు చేసుకున్నారు. ప్రగతి ప్రదాతకు పుష్పాంజలి ఘటించారు. మహానేత విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా ప్రజలు ఆయనను స్మరించుకున్నారు.

నగరంలో పలుచోట్ల..

నగరంలో డీసీసీ బ్యాంకు వద్ద వైఎస్సార్ విగ్రహానికి విజయానందరెడ్డి , డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ నివాళి అర్పించారు. అనంతరం సంతపేటలో మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. మెడికల్ క్యాంప్ నిర్వహించి 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ప్రజలకు అల్పాహారం అందించారు. మధ్యాహ్నం మాజీ ఎంపీ, మాజీ విదేశీ వ్యవహారాల సలహాదారుడు జ్ఞానేంద్రరెడ్డి, చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాహుల్‌రెడ్డి అన్నదానం చేశారు. స్థానిక తిమ్మసముద్రంలో నాయకులు గిరిధర్‌రెడ్డి, శివారెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించి పేదలకు బెడ్‌షీట్లు అందజేశారు. కలెక్టర్ బంగ్లా సమీపంలో నాయకులు సయ్యద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, జెడ్పీటీసీ బాబునాయుడు, నాయకులు, ప్రజాప్రతినిధులు, లయన్స్‌క్లబ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే జెడ్పీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, జెడ్పీటీసీలు బాబు నాయుడు, భారతి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మధు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: మహిళల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషిచేసిన మహనీయుడు వైఎస్ రాజశేఖర రెడ్డి అని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి అన్నారు. గుడిపాలలోని మొగరాళ్లపల్లె, శ్రీరంగంపల్లెలో మంగళవారం వైఎస్‌ఆర్ వర్ధంతి సందర్భంగా మహానేతకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వన్‌డిపోలో..

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఆర్టీసీ వన్‌డిపో గేటు ఎదుట మంగళవారం వైఎస్సార్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో దివంగత మాజీ సీఎం వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. అలాగే క్రిస్టియన్ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్ ప్రసాద్, పాస్టర్ చర్చిల్లో రూ.2 లక్షలు విలువ చేసే వంద బైబిల్స్ అందజేశారు.



సంతపేటలో మెడికల్ క్యాంప్‌లో వైద్య పరీక్షలు



అన్నదానం చేస్తున్న మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి



జెడ్పీలో నివాళి ఇస్తున్న వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి



గుడిపాల: మొగరాళ్లపల్లెలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న విజయానందరెడ్డి



వన్‌డిపో వద్ద నివాళులర్పిస్తున్న ఆర్టీసీ కార్మికులు

పేదవాడి గుండెచప్పుడు వైఎస్సార్

బంగారుపాళెం: పేదల గుండెల్లో కొలువై ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చిరస్మరణీయులని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి కొనియాడారు. మంగళవారం పూతలపట్ట నియోజకవర్గవ్యాప్తంగా మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా కరడివారిపల్లెలో పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడి గడపకు చేరాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ఎందరో పేదల ప్రాణాలను కాపాడిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, విద్యుత్ పాత బకాయిలు రద్దు చేసి రైతు బాంధవుడిగా ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ ఆశారాజేష్, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ విభాగ నేతలు పాల్గొన్నారు. మొగిలి వెంకటగిరిలో తులసీరామ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో, కీరమందలో సర్పంచ్ రాజా, సాంబయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు.

యాదమరిలో..

యాదమరి: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యులు మనోహర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు, కార్యకర్తలు, అనుబంధ విభాగనేతలు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు మండలం ఎం.బండపల్లిలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డితో కలిసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అన్నదానం చేశారు. పి.కొత్తకోటలో రాజారత్నంరెడ్డి ఆధ్వర్యంలో అనాథలకు దుప్పట్లు అందజేశారు.

ఐరాలలో..

ఐరాల: మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మహానేత విగ్రహానికి క్షీరాభిషేకం చేపట్టి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుండ్లపల్లెలో స్థానిక సర్పంచ్ రెడ్డెమ్మ ఆధ్వర్యంలో, ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నాయకులు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, అన్నదానాలు చేపట్టారు.



బంగారుపాళెంలో అన్నదానం



యాదమరిలో..



పి.కొత్తకోటలో ..



ఐరాల : గోవిందరెడ్డిపల్లెలో ..

సోలార్ ప్రాజెక్ట్‌కు భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ

యాదమరి: మండలంలో పీఎం కుసుం సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమయ్యే భూములను చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. మంగళవారం అయన స్థానిక తహసీల్దార్ పార్థసారథి, రెవెన్యూ సిబ్బందితో పాటు దాసరాపల్లి, బుడితిరెడ్డిపల్లి పంచాయతీల్లో పర్యటించారు. దాసరాపల్లిలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి దేవస్థానానికి చెందిన దాదాపు 10 ఎకరాలు ప్రాజెక్ట్ నిర్మాణానికి అనువుగా ఉంటుందని గుర్తించారు. బుడితిరెడ్డిపల్లి పంచాయతీలో భూసమస్యలు ఉన్నందున దాసరాపల్లిలోని ఆలయ భూములను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. సంబంధిత ప్రాజెక్ట్ అధికారులు ఈరోజు దాసరాపల్లిలోని ధర్మరాజుల స్వామి ఆలయ భూములను పరిశీలించే అవకాశం ఉంది. కాగా పీఎం కుసుం సోలార్ ప్రాజెక్ట్ ద్వారా మండలంలో 20 కిలో వాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నారు. కార్యక్రంలో ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్‌ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సంచాలకులు

యాదమరి: రైతులు నానో యూరియా వాడకంపై దృష్టి పెట్టాలని చిత్తూరు డివిజన్ వ్యవసాయ సంచాలకులు ఉమ చెప్పారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని సత్రావూరులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రైతు ఇటీవలి కాలంలో అధిక మొత్తంలో యూరియా వాడుతున్నారని, కానీ దాని వల్ల పంటలకు అనర్థం చేకూరే ప్రమాదం ఉందన్నారు. నీమాస్త్రం, జీవామృతం వంటి సేంద్రియ ఎరువులను వాడాలని రైతులకు సూచించారు. అనంతరం రైతులకు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఏఓ, సిబ్బంది, పాల్గొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న శ్రీశైలం ఈఓ

కాణిపాకం: శ్రీశైలం మల్లికార్జున స్వామి వారి దేవస్థానం తరపున కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామికి మంగళవారం ఈఓ శ్రీనివాస్‌రావు పట్టువస్త్రాలను సమర్పించారు. కాణిపాకం దేవస్థానం అతిథిగృహం నుంచి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి.. దర్శించుకున్నారు. ఈఓ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

వీనులవిందుగా నాట్యం..



నృత్యం చేస్తున్న కళాకారులు

కాణిపాకం: వార్షిక ఉత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన కళాకారులు నృత్య ప్రదర్శనలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. కూచిపూడి, భరతనాట్యంతో పలువురు కళాకారులు అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. గీతాలాపనలు, పౌరాణిక నాటక ప్రదర్శన, కోలాటాలతో ఆకట్టుకున్నారు. ఆలయ అధికారులు ప్రశంసాపత్రంతో సత్కరించారు.

ఆత్మీయ పలకరింపు

బంగారుపాళెం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘుపతిరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలో వైఎస్సార్‌కు నివాళులు అర్పించేందుకు బంగారుపాళెం నుంచి బైక్‌పై వచ్చానని చెప్పడంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించినట్లు రఘుపతిరాజు తెలిపారు.

వ్యవసాయానికి పీఎం కుసుం

- రూ.220 కోట్లతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై సమీక్ష
- 161 ఎకరాల మంజూరుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆమోదం
- ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో పీఎం కుసుం పథకం కింద సోలార్ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రాజెక్టు డైరెక్టర్ అయూబ్‌ఖాన్ తిరుపతి నుంచి మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న పీఎం కుసుం పథకం గురించి ఆరా తీశారు. దీనిపై ఎస్‌ఈ స్పందించారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 161 ఎకరాల స్థలం ఇవ్వడానికి కలెక్టర్ అంగీకరించడంతో పాటు పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. బంగారుపాళ్యం, యాదమరి, గుడిపాల మండలాల నందు 40 మెగావాట్ల సోలార్ యూనిట్ పెట్టనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి టెండర్ పనులు సైతం పూర్తయిందన్నారు. ఇక పూతలపట్టు మండలంలో మరో 55 ఎకరాలకు త్వరలో అనుమతులు ఇస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారన్నారు. అనుమతులు వచ్చాక అక్కడ 15 మెగావాట్ల సోలార్ యూనిట్ పెట్టనున్నట్లు చెప్పారు. వీటితో పాటు జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో ప్రభుత్వ స్థలం ఎంపిక చేసి అనుమతి కోసం కలెక్టర్‌కు నివేదిక పెట్టామన్నారు. ఒక మెగావాట్ సోలార్ పలకాలు ఏర్పాటు చేయడానికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల మేర ఖర్చవుతుందన్నారు. చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో మొత్తం రూ.220 కోట్లతో సోలార్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం రూ.320 కోట్లతో 80 మెగావాట్ల సోలార్ యూనిట్ ఏర్పాటు చేసి తద్వారా 427 వ్యవసాయ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం నిర్మాణ, డీపీఈ, ఆపరేషన్ డివిజన్ ఈఈలతో ఎస్‌ఈ పలు అంశాలపై సమీక్షించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి రెడ్డెప్ప

ఐరాల: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణుల ఆరోగ్యం పట్ల ఆశావర్కర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారి రెడ్డెప్ప సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా ఆయన ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడంలో ఆశావర్కర్ల పాత్ర కీలకమని తెలిపారు. పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న వైద్య పరీక్షలు ప్రతి గర్భిణికి అందించాలని సూచించారు. పౌష్టికాహారమైన ఆహారం, సమతుల ఆహారం గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికీ సరిపడా రోగ నిరోధకశక్తి కలిగి ఉండాలంటే పౌష్టికాహారంతో పాటు సమతుల ఆహారం అవసరమని, తద్వారా వారి ఆరోగ్య పరిస్థితి మెరుగు పరచడానికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు సమన్వయంతో తమ సచివాలయాల పరిధిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



విజయానందరెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని డీఐరోడ్డులో కొలువుదీరిన గణనాథులను మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఊరేగింపుగా వచ్చి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామికి గజమాల వేసి కర్పూర హారతి పట్టారు. ఈ సందర్భంగా చవితి నిర్వాహకులు కన్నన్ ఆయనకు కేరళవాయిద్యం, డప్పు వాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి గాయత్రిదేవి, రాష్ట్ర మొదలియార్ విభాగం అధ్యక్షుడు జ్ఞాన జగదీష్, నాయకులు మనోహర్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, కరుణాకర్, నౌషద్, హరీష్‌రెడ్డి, ఉన్ని, మధు, చామంతి, పాండి, పిచ్చాండి, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డికి బెయిల్ రావాలని పూజలు



అర్ధగిరి క్షేత్రంలో పూజలు చేస్తున్న నాయకులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కూటమి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులో జైలు పాలైన రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డికి వెంటనే బెయిల్ మంజూరై విడుదల కావాలని ఆకాంక్షిస్తూ మంగళవారం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు హరిరెడ్డి ఆధ్వర్యంలో స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సహజ సిద్ధమైన సంజీవరాయ పుష్కరిణి ముందు ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దిరెడ్డి అభిమానులు, యువకులు, అనుబంధ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

మండలంలో దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాంధీబాబు, మండల పార్టీ అధ్యక్షుడు హరిరెడ్డి ఆధ్వర్యంలో తవణంపల్లె, మత్యం క్రాస్, అరగొండ కొత్త బస్టాండులో వైఎస్సార్ విగ్రహానికి గజమాలలు వేసి, పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ చిరస్మరణీయుడని, ప్రజల గుండెల్లో నిలిచాడని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి, జెడ్పీటీసీ భారతి, నాయకులు గాంధీబాబు, హరికృష్ణారెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, పార్థసారథిరెడ్డి, యువత పాల్గొన్నారు.



వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న నేతలు

పెండింగ్ బకాయిలకు ఆమోదం తెలపాలి



మాట్లాడుతున్న రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిల అంశంపై కేబినెట్‌లో ఆమోదం తెలపాలని వైఎస్‌ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల నాలుగో తేదీన జరిగే కేబినేట్‌లో ఇతర అంశాలతో పాటు ఉద్యోగుల ఆర్థిక అంశాలను అజెండాలో చేర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి దసరా కానుకగా పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించి తాత్కాలిక భృతి 30 శాతం ప్రకటించాలన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన 105 రకాల ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై స్పష్టత తెలపాన్నారు.

రథోత్సవం ఏర్పాట్ల పరిశీలన

కాణిపాకం: కాణిపాకంలో బుధవారం జరిగే రథోత్సవ ఏర్పాట్లను డీఎస్పీ సాయినాథ్ పరిశీలించారు. సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్‌ఐ నరసింహులతో కలిసి రథోత్సవ సమయంలో తీసుకోవాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా, రథోత్సవం ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు.